## సిమెంటు ఫ్యాక్టరీల్లో రసాయన నిల్వలపై తనిఖీలు




యాడికి, మే 2(అనంత ప్రభ)
యాడికి మండలంలోని సాగర్ సిమెంట్ మరియు పెన్నా సిమెంట్ ఫ్యాక్టరీల్లో నిల్వ ఉంచిన అమ్మోనియం నైట్రేట్ స్టోరేజ్ పాయింట్లను యాడికి మండల తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. భద్రతా ప్రమాణాలు, నిల్వ విధానాలు, రికార్డుల నిర్వహణపై సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రమాదకర రసాయనాల నిల్వలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రభుత్వం నిర్ణయించిన అన్ని నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తహసిల్దార్ స్పష్టం చేశారు. తనిఖీల్లో డిప్యూటీ తహసిల్దార్ శ్రీనివాసులు, గుడిపాడు విఆర్ఓ భీమేశ్వర్ రెడ్డి, ఫ్యాక్టరీ సిబ్బంది పాల్గొన్నారు

## యాడికిలో రీ సర్వేపై అవగాహన




యాడికి, మే 2 (అనంత ప్రభ)
యాడికిలో రీ సర్వే ప్రక్రియ ప్రారంభం సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో అవగాహన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు రైతులకు రీ సర్వే ప్రక్రియ ప్రాముఖ్యతను వివరించి, భూసంబంధిత సమస్యల పరిష్కారానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని తెలియజేశారు.రైతులందరూ రీ సర్వే కార్యక్రమంలో సహకరించాలని కోరుతూ, భూముల సరిహద్దులు స్పష్టంగా నమోదవడం వల్ల భవిష్యత్తులో తలెత్తే వివాదాలు తగ్గుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ దడియాల ఆది, టీడీపీ సీనియర్ నాయకుడు గొర్తి రుద్రమ నాయుడు, యాడికి మండల తహసిల్దార్ ప్రతాపరెడ్డి, రీ సర్వే డిప్యూటీ తహసిల్దార్ విజయ్, మండల సర్వేయర్ శేష సాయి, గ్రామ రెవెన్యూ అధికారులు దామోదర్ నాయుడు, కుమార్, గ్రామ సర్వేయర్లు శ్రీనాథ్ రెడ్డి, లలిత, రైతులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో జనగణన ప్రారంభం



యాడికి, మే 2 (అనంత ప్రభ)
యాడికి మండల కేంద్రంలో జనగణన కార్యక్రమాన్ని శనివారం క్షేత్ర-స్థాయిలో అధికారులు ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని మండల తహసిల్దార్ ప్రతాప్‌రెడ్డి, ఎంపీడీవో వీరరాజు, డిప్యూటీ తహసిల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో జనగణన ప్రక్రియను మొదలుపెట్టారు. ఈ సందర్భంగా తహసిల్దార్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ జనగణన దేశాభివృద్ధికి పునాది అని పేర్కొన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు, అవసరాలు, వనరులపై ఖచ్చితమైన అంచనాలు పొందేందుకు ఈ కార్యక్రమం కీలకమని తెలిపారు. ప్రతి ఇంటిని సందర్శించే ఎన్యుమరేటర్లకు కుటుంబ సభ్యుల సంఖ్య, వాహనాలు, నివాస పరిస్థితులు వంటి పూర్తి వివరాలను అందించాలని ప్రజలకు సూచించారు. ప్రజల సహకారమే జనగణన విజయానికి మూలాధారం అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాల్గవ సచివాలయ మహిళా పోలీస్ ఇంద్రజ, వెల్ఫేర్ అసిస్టెంట్ అలిమ్ భీ, వీఆర్వో పద్మావతితో పాటు ఇతర సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఒక మార్కు తేడా విద్యార్థి ప్రాణం తీసింది



యాడికి, మే 2 (అనంత ప్రభ)
యాడికి మండలం నిట్టూరు గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామంలోని స్థానిక ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థిని అపర్ణ ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో 410 మార్కులు సాధించినప్పటికీ, సైన్స్ సబ్జెక్టులో కేవలం ఒక మార్కు తేడాతో ఫెయిల్ కావడం తీవ్ర మనస్తాపానికి గురిచేసింది. ఈ క్రమంలో ఆమె పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే రెండు రోజులుగా చికిత్స పొందుతూ శనివారం ఆమె ప్రాణాలు కోల్పోయింది. ఈ సంఘటన గ్రామంలో విషాద వాతావరణాన్ని నెలకొల్పింది

## కూడేరు సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం




కూడేరు, మే 2 (అనంత ప్రభ)
కూడేరు సమీపంలోని అరవకూరు చెరువు మలుపు వద్ద శనివారం రోజున రాత్రి 9:20 నిమిషాలకు ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న కూడేరు సర్కిల్ ఇన్స్పెక్టర్ రాజు వారు సిబ్బందితో హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని జరిగిన సంఘటనపై ఆరా తీయగా వజ్రకరూరు మండలం పందికుంట గ్రామానికి చెందిన అజిత్ (20) అంకంపల్లి ఆకాష్ (21) ఇద్దరు స్నేహితులు పల్సర్ బైక్ లో అనంతపురంలోని పెళ్లికి బయలుదేరి వెళుతుండగా కూడేరు సమీపంలోని మార్గమధ్యంలో అరవకూరు చెర-ువు కట్ట మలుపు వద్ద కు రాగానే ఆటోను ఓవర్టేక్ చేసి బైక్ లో వెళ్తుండగా అనంతపురం నుండి ఎదురుగా వస్తున్న బొలెరో వాహనానికి ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనంలో షార్ట్ సర్క్యూట్ అయి మంటలు చెలరేగి బైక్ లో ప్రయాణిస్తున్న యువకులు ఇద్దరు కాలిపోయి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. (పల్సర్ బైక్ బొలెరో వాహనాన్ని ఢీకొట్టడంతో) అదే బొలెరో వాహనం అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొట్టింది, దాంతో ఆటోలో ఉన్న గోపాల్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో పోలీసులు చికిత్స నిమిత్తం అంబులెన్స్ లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దాంతో కూడేరు సర్కిల్ ఇన్స్పెక్టర్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## హిందూ స్మశాన వాటిక అభివృద్ధికి హామీ




యాడికి, మే 2 (అనంత ప్రభ)
యాడికి మండల కేంద్రంలోని కోన రోడ్డు హిందూ స్మశాన వాటిక అభివృద్ధికి అధికారులు ముందుకొచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఏప్రిల్ 6న యాడికి పర్యటన సందర్భంగా స్థానికుడు వెంకటరాముడు కోన రోడ్డు హిందూ స్మశాన వాటిక చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం, తాగునీటి సౌకర్యం సహా మౌలిక వసతులు కల్పించాలని సీఎం చంద్రబాబుకు వినతి పత్రం అందజేశారు. ఈ వినతిపై స్పందించిన అధికారులు శనివారం వెంకటరాముడిని పిలిపించి, స్మశాన వాటికకు అవసరమైన ప్రహరీ గోడతో పాటు ఇతర మౌలిక సదుపాయాలను త్వరలో ఏర్పాటు చేయనున్న సర్వసభ్య సమావేశం నందు సభ్యులు ఆమోదంతో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గత కొన్నేళ్లుగా ఈ సమస్యపై మిత్రులతో, పెద్దలతో కలిసి అనేక మంది అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసినా ఫలితం రాలేదని వెంకటరాముడు తెలిపారు. అయితే సీఎం దృష్టికి విషయం తీసుకెళ్లిన తర్వాత అధికారులు స్పందించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు

## పార్థసారథిపై బెదిరింపులు: వైసీపీ అసలు స్వరూపం బయటపడింది గుడిసె ఆది కృష్ణమ్మ




ఆదోని, మే 2 (అనంత ప్రభ)
ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథిపై వైసీపీ పార్టీ కార్యకర్త సోషల్ మీడియాలో చేసిన అత్యంత అనుచిత, అసభ్యకర వ్యాఖ్యలను తెలుగుదేశం పార్టీ తీవ్రంగా ఖండించింది. ఒక ప్రజాప్రతినిధిపై దాడి చేసే విధంగా మాట్లాడటం రాజకీయ సంస్కృతి కాదని స్పష్టం చేసింది. “చంపడానికైనా, చావడానికైనా సిద్ధం” వంటి బెదిరింపులు చేయడం చట్టవిరుద్ధమే కాకుండా సమాజంలో అశాంతి సృష్టించే ప్రమాదకర చర్యగా పేర్కొంది. ఇలాంటి వ్యాఖ్యలు వైసీపీ పార్టీ నీచ రాజకీయాలకు, వారి అనుచిత సంస్కృతికి ప్రత్యక్ష నిదర్శనమని మండిపడింది. ప్రజాస్వామ్యంలో విమర్శలు చేయడం సహజమే అయినప్పటికీ, వ్యక్తిగత దూషణలు, బెదిరింపులు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకారయోగ్యం కావని తెలిపింది. తెలుగుదేశం పార్టీ తరఫున స్పష్టంగా డిమాండ్ చేస్తూ, ఇలాంటి వ్యాఖ్యలు చేసిన వారిపై తక్షణం కఠిన చర్యలు తీసుకోవాలని, సోషల్ మీడియా దుర్వినియోగంపై పోలీసులు వెంటనే కేసు నమోదు చేయాలని, ప్రజాప్రతినిధుల భద్రతను ప్రభుత్వం నిర్ధారించాలని కోరింది. జిల్లా అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ, కురుబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప ఈ అంశాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకుని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను విజ్ఞప్తి చేశారు. చివరిగా, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే ఇలాంటి అశ్లీల, హింసాత్మక రాజకీయాలకు పూర్తిస్థాయిలో చెక్ పెట్టాల్సిన అవసరం ఉందని తెలుగుదేశం పార్టీ స్పష్టం చేసింది.

## ఆపరేషన్ “వజ్రప్రహార్”లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మెగా కార్డన్ డే



ఆదోని, మే 2 (అనంత ప్రభ)
రాష్ట్రంలో మాదకద్రవ్యాల నియంత్రణ లక్ష్యంగా చేపట్టిన “ఆపరేషన్ వజ్రప్రహార్” కార్యక్రమంలో భాగంగా ఈ రోజు రాష్ట్రవ్యాప్తంగా మెగా కార్డన్ డే నిర్వహించారు. డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఐపిఎస్ ఆదేశాల మేరకు ఈగల్ చీఫ్ ఏకే రవి కృష్ణ, ఐపిఎస్ పర్యవేక్షణలో, కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఐపిఎస్ ఆధ్వర్యంలో ఈ ఆపరేషన్ కొనసాగింది. ఈ సందర్భంగా 02-05-2026 ఉదయం 06:00 గంటలకు ఇస్వీ పోలీస్ స్టేషన్ పరిధిలోని కపటి గ్రామంలో మెగా కార్డన్ ఒ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ ఆపరేషన్‌లో ఆదోని రూరల్ సీఐ నల్లప్ప, ఆదోని 1 టౌన్ సీఐ చంద్రశేఖర్, ఆదోని 2 టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి, అలాగే ఆదోని రూరల్, ఇస్వీ, ఆదోని 1 టౌన్ ఎస్ ఎల్ ఎస్ , పిసిఆర్ఈగల్ టీమ్ సభ్యులు మరియు సుమారు 30 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఆపరేషన్ ప్రారంభానికి ముందు ప్రత్యేక బృందాలు గుర్తించిన హాట్‌స్పాట్ ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా మాదకద్రవ్యాల వినియోగం జరుగుతున్నట్లు అనుమానించిన ప్రాంతాలు, అద్దె ఇళ్లు, ఖాళీ భవనాలు, పాత గంజాయి మరియు నార్కోటిక్ కేసులలో ఉన్న ముద్దాయిల ఇళ్లలో సోదాలు నిర్వహించారు. ఆపరేష-న్‌లో భాగంగా 07 మంది రౌడీ షీటర్లు, 03 మంది అనుమానితులను తనిఖీ చేయగా ఎటువంటి అక్రమ ఆయుధాలు స్వాధీనం కాలేదు. 19 వాహనాలను తనిఖీ చేసి పత్రాలు లేని 07 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. రౌడీ షీటర్లు మరియు అనుమానితులను స్పాట్‌లో పిలిపించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించి స-త్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక మరియు చట్టపరమైన దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును దెబ్బతీస్తాయని, కుటుంబ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయని వివరించారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1972కు తెలియజేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించే వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. అదేవిధంగా ఈ కార్యక్రమంలో భాగంగా పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజలతో కలిసి “ఆపరేషన్ వజ్రప్రహార్ ప్రతిజ్ఞ” నిర్వహించి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని సంకల్పించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు




## జర్నలిస్టులకు తగిన రక్షణ కల్పించాలి



యాడికి, మే 2 (అనంత ప్రభ)
చిత్తూరు జిల్లా వి.కోటలో జరిగిన విలేకరి హత్య ఘటనపై ఎమ్మార్పీఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనను ఖండిస్తూ హంతకులకు కఠిన శిక్ష విధించాలని వారు డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ యాడికి మండల అధ్యక్షుడు పాతకుట్ల బాలు మాదిగ మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు, అన్యాయాలు, అక్రమాలను వెలుగులోకి తీసుకువచ్చేది జర్నలిజం అని పేర్కొన్నారు. అలాంటి పవిత్రమైన వృత్తిపై ఇలాంటి దారుణ సంఘటనలు జరగడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. ప్రజాస్వామ్యంలో జర్నలిజం నాలుగో స్తంభమని గుర్తుచేస్తూ, జర్నలిస్టులకు తగిన రక్షణ లేకపోవడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర డీజీపీ, ప్రభుత్వాన్ని అనంతపురం జిల్లా యాడికి మండల ఎమ్మార్పీఎస్ తరఫున కోరుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికార ప్రతినిధి చిటికల చిరంజీవి మాదిగ, వరుణ్ మాదిగ, భాస్కర్ మాదిగ, కుల్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన



యాడికి, మే 2 (అనంత ప్రభ)
జిల్లా మలేరియా అధికారి డి ఓబులు ఆదేశాల మేరకు, రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ దేవరాజన్, డాక్టర్ అప్పయ్య ఆధ్వర్యంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు చందన సచివాలయంలో యూఐపీ ఇమ్యునైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు మరియు ప్రజలకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఉదయం 11 గంటలలోపు పనులు ముగించుకొని ఇళ్లకు వెళ్లాలని సూచించారు. గ్రామంలో జ్వరం వచ్చిన ప్రతి ఒక్కరికి రక్తపూతలు తీసుకోవాలని తెలియజేశారు. అనంతరం రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్‌ను పరిశీలించి ఎమ్ఎఫ్ 2 డైరీ పెండెన్సీ, ఎన్ఎఫ్ 7, ఎమ్ఎఫ్ 8, జేఎస్పి 1,2 స్టెయినింగ్ విధానాలను పరిశీలించి ల్యాబ్ టెక్నీషియన్ సాయిలతకు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రజిని, మేల్ హెల్త్ అసిస్టెంట్ మైనుద్దీన్, ఎంఎల్ హెచ్పి కవిత, ఆశా కార్యకర్తలు నాగలక్ష్మి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గణేకల్ హత్య కేసు: నిందితుడు అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు



ఆదోని, మే 2 (అనంత ప్రభ)
గణేకల్ గ్రామంలో గత నెలలో జరిగిన కిరాతక హత్య కేసులో నిందితుడిని పెద్ద తుంబలం పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఆదోని రూరల్ సిఐ సి. నల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం, గణేకల్ గ్రామానికి చెందిన కుల్లూరు వెంకటేశ్వర్లు మరియు సంకిరెడ్డి హనుమంత రెడ్డి మధ్య కొంతకాలంగా మనస్పర్థలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 28 అర్ధరాత్రి సుమారు 12:30 గంటల సమయంలో నిందితుడు వెంకటేశ్వర్లు, హనుమంత రెడ్డి ఇంటి సమీపంలో అతనిపై గొడ్డలితో దాడి చేసి దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటనపై పెద్ద తుంబలం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడి కోసం గాలింపు కొనసాగించగా, మే 2 మధ్యాహ్నం సుమారు 1:10 గంటలకు గణేకల్ గ్రామ ఆర్చ్ సమీపంలో వెంకటేశ్వర్లు ఉన్నట్లు సమాచారం అందింది. వెంటనే సిఐ నల్లప్ప ఆధ్వర్యంలో పోలీసులు మెరుపుదాడి చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని రిమాండ్‌కు తరలించారు. హత్య జరిగిన తక్కువ సమయంలోనే నిందితుడిని అరెస్ట్ చేయడంలో కీలక పాత్ర పోషించిన ఎస్ఐ విద్యాశ్రీతో పాటు హెడ్ కానిస్టేబుల్ గోపాల్, సిబ్బంది వెంకటేష్ నాయక్, రంగస్వామి, నరసింహులు, బంగారప్పలను సిఐ అభినందించారు. నేరాలకు పాల్పడేవారు ఎంతటి వారైనా చట్టం ముందు తప్పించుకోలేరని, ప్రజలు శాంతియుతంగా ఉండాలని పోలీసులు సూచించారు.

## జన్మదిన సందర్భంగా సీఎం చంద్రబాబును కలిసిన టిడిపి నేత బండారు రామాంజనేయులు



శింగనమల, మే 2 (అనంత ప్రభ)
టీడీపీ సీనియర్ నాయకుడు బండారు రామాంజనేయులు జన్మదినాన్ని పుర-స్కరించుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మర్యాదపూర్వకంగా కలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా రామాంజనేయులు ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి ఆశీర్వాదాలు పొందారు. రాష్ట్ర అభివృద్ధి, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం వంటి అంశాలపై చర్చ జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బండారు రామాంజనేయులు పార్టీ పట్ల ఉన్న నిబద్ధతను, ప్రజాసేవలో చూపుతున్న కృషిని అభినందిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బండారు రామాంజనేయులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని తెలిపారు. ముఖ్యమంత్రి ఆశీస్సులు తనకు మరింత ప్రేరణనిచ్చాయని పేర్కొన్నారు. అనంతరం రామాంజనేయులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.